క్లుప్తంగా

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు



ప్రయాణికులకు బహుమతులు పంపిణీ చేస్తున్న డీఎం సుధాకరయ్య

పుంగనూరు: ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు సోమ వారం డీఎం సుధాకరయ్య బహుమతులు పంపిణీ చేశారు. పుంగనూరు డిపో నుంచి వివిధ రూట్లలో ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణించే ప్రయాణికులకు లక్కీడిప్ నిర్వహిస్తుండడం విదితమే. రాయచోటి, ముళబాగిల్, మేటిమంద, కలికిరి, తిరుపతి రూట్లలో ప్రయాణించిన ప్రయాణికులు గిఫ్ట్ బాక్సుల్లో వేసిన టికెట్లను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులు ఇచ్చినట్లు డీఎం చెప్పారు. వివిధ ప్రాంతాలకు చెందిన అహమ్మద్‌బాషా, బాషా, ఎస్.వెంకట్రమణ, అలివేలమ్మ, పాల్‌బాషా, ఆర్వీ.రెడ్డి, శిల్ప, సంతోష్ లకు బహుమతులు పంపిణీ చేసి, వారిని అభినందించారు. సురక్షిత ప్రయాణాలకు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని డీఎం కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, మెకానిక్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ



బైరెడ్డిపల్లెలోని ప్రైవేటు పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఎంఈఓలు

బైరెడ్డిపల్లె: మండలంలోని ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఎంఈఓలు వేణుగోపాల్ రెడ్డి, సుబ్రమణ్యం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, అడ్మిషన్ రిజిస్టర్, రికగ్నైజ్ వివరాలు, ఆన్‌లైన్‌లో విద్యార్థుల మార్కుల నమోదు, ఉపాధ్యాయుల హాజరు పట్టిక.. ఇత్యాది వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నపాటి తప్పిదాలు పాఠశాల పునఃప్రారంభం లోపు సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రామచంద్ర, షాబుద్దీన్ పాల్గొన్నారు.

12న 'డయల్ యువర్ డీఎం'

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రయాణికులు, ప్రజలు తమ సలహాలు–సూచనలు, ఏవైనా ఆర్టీసీ పరంగా సమస్యలను సెల్ నంబర్: 9100941850 కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

జెడ్పీ కార్యాలయం తనిఖీ



జెడ్పీ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సీఈఓ గ్లోరియా

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ కార్యాలయ అనుబంధ విభాగాలను సీఈఓ గ్లోరియా సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని గణాంకాలు, ప్రణాళిక, పీఎఫ్, విద్య, వ్యవస్థాపక విభాగాల గదులను ఆమె పరిశీలించారు. విభాగాల వారీగా ఎంత మంది ఉద్యోగులు, సిబ్బంది ఉండాలి..? ఎంత మంది ఉన్నారు? అనే వివరాలు ఏఓలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్యాలయ పరంగా కావాల్సిన కంప్యూటర్లు, ఇతర సామగ్రి వివరాలు గురించి మాట్లాడారు. ఉద్యోగుల ఖాళీలు, విద్యుత్ పరికరాల అవసరాల నివేదికను సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం

సత్యవేడు: మండల పరిధిలోని దాసుకుప్పం పంచాయతీలో వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను ఆదివారం అర్ధరాత్రి టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. సురుటుపల్లి ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సర్పంచ్ ఏ.రవిరెడ్డి ఈ ఘటనను ఖండించారు. గతంలో ఎన్నడూ పంచాయతీ పరిధిలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని వారు తెలిపారు.



దాసుకుప్పంలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె

సేంద్రియం.. భూమికి బలం

పంటల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంతో దిగుబడులు పెరుగుతున్నా కాలక్రమంలో సారవంతమైన భూములు సత్తువ కోల్పోయి, చౌడు భూములుగా మారే ప్రమాదం ఉంది. అంతేకాకుండా పండించిన వ్యవసాయ ఉత్పత్తుల్లో కూడా క్రిమిసంహారక మందుల అవశేషాలు ఉండటం వల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతాయి. అందుకే రసాయనిక మందులు, పురుగుల మందుల వాడకం తగ్గించాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతాంగానికి పదే పదే చెబుతున్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. అలాగే సేంద్రియ వ్యవసాయంపై తరచూ అవగాహన సదస్సులు నిర్వహించి, రైతలను ఆ దిశగా మళ్లించేందుకు తనవంతు కృషి చేస్తోంది.

- సేంద్రియ ఎరువులకు పెరిగిన డిమాండ్



పొలానికి ఎరువులను వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు

గుడుపల్లె: రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడడంతో భూములు సహజత్వాన్ని కోల్పోయి పంటలు సక్రమంగా పండడం లేదు. పెట్టుబడులు ఖర్చులు ఏటా పెరుగుతుండడంతో వ్యవసాయంలో గిట్టుపాటు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన, నాణ్యమైన దిగుబడులు పొందడమే కాకుండా దీర్ఘకాలం స్థిరంగా పంటలు పండించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

పురుగు మందుల ప్రభావం

ప్రస్తుతం పంటల సాగు పరంగా పురుగు మందుల వాడకం ఎక్కువగా ఉండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం జీవరాశులు కూడ అదే స్థాయిలో చనిపోతున్నాయి. ప్రపంచంలో 4 శాతం భూమి ఇప్పటికే సత్తువ కోల్పోయి ఎందుకు పనికి రాకుండా పోయిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గుండె జబ్బులు, కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. పంటలకు మేలు చేసే తూనీగలు, సాలీడు, కందిరీగలు, అక్షింతల పురుగుల వంటి మిత్ర పురుగులు రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం వల్ల చనిపోతున్నాయి. వీటి వాడకం ఇలాగే కొనసాగితే నేల, నీరు, గాలి చివరకు పర్యావరణం కూడా కలుషితమవుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

పశువుల ఎరువు

ఒకప్పుడు రైతులకు ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు అధికంగా ఉండేవి. పేడను ఎరువుగా పంటలకు ఉపయోగించి వారు. ప్రతి గ్రామంలోని మేకలు , గొర్రెల మందలు బాగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.ఇది వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది.

పేడ ఎరువులకు పెరిగిన డిమాండ్

వ్యవసాయాధికారుల అవగాహన సదస్సుల మూలాన పండ్ల తోటల రైతులు రసాయనిక మందులు కాకుండా సేంద్రియ ఎరువులను ఉపయోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు ఆశిస్తున్నారు. దీంతో పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం పెరిగే కొద్దీ డిమాండ్ కూడా ప్రతి ఏటా పెరుగుతోంది.



సేంద్రియ ఎరువులను సిద్ధం చేసి భూమికి వేసేందుకు పనులు చేస్తున్న రైతన్న

పంటల మార్పిడి చాలా అవసరం

భూసారాన్ని కాపాడడానికి ఎప్పుడూ ఒకే పంటను కాకుండా వివిధ రకాల పంటల సాగుతో పంటల మార్పిడి చేయాలి. పంటలకు కావలసిన పోషకాలను కంపోస్టు ఎరువుల ద్వారా జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను పొలంలో పెంచి, కలియదున్నడం వల్ల పంటలకు పోషకాలను అందించవచ్చు. సేంద్రియ ఎరువులైన వేరుశనగ చెక్క, ఆముదం చెక్క, కానుగ చెక్క, వేప పిండి లాంటి వాటిని విరివిగా వాడాలి.

కక్ష సాధింపుతో దాడులు చేయడం సరికాదు

- ఎన్నికల్లో గెలుపోటములు సహజం
- ప్రజాసమస్యలు, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించండి
- ప్రభుత్వ ఆస్తులు కాపాడటం అందరి బాధ్యత
- కూటమి నాయకులకు డీఎస్పీ విష్ణు రఘువీర్ హితవు



మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణు రఘువీర్

వి.కోట: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలుపొందిన కూటమి నాయకులు దాడులు, ఆస్తుల ధ్వంసానికి నాయకులు పాల్పడటం సరికాదని డీఎస్పీ విష్ణు రఘువీర్ హితవు పలికారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎన్నికల ఫలితాల అనంతరం ఇటీవల కూటమి నాయకులు అక్కడక్కడా ధ్వంసం చేయడం, రోడ్లపై అల్లర్లు చేయడం, ప్రత్యర్థుల నాయకులపై రాళ్ల దాడులు చేయడం వంటివి చేస్తున్నారన్నారు. ఇదంతా తగదని, సంయమని పాటించి ప్రభుత్వ ఆస్తులను కాపాడటం అందరి బాధ్యత అని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్న వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం ఎంతమాత్రమూ తగదన్నారు. అన్నింటికీ చట్టాలున్నాయని, ఏదైనా సరే చట్టపరంగా చూసుకోవాలని సూచించారు. అందరి సమన్వయంతో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలపై కొత్త చట్టం అమలులోకి వచ్చిందని, ఈ నియమాలను ఉల్లంఘించిన వారికి భారీగా జరిమానా విధించడంతోపాటు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కొత్త నియమ నిబంధనలకు వాహనదారులు పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, సీట్ బెల్ట్ వాడాలని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని, బైక్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ప్యాసింజర్ ఆటోలు ఓవర్ లోడుతో వెళితే కూడా కేసులు తప్పవన్నారు. సమావేశంలో సీఐ లింగప్ప, సీఐ లింగప్ప, ఎస్ఐ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ 'సమ్మేళనం'

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం జెడ్పీ హైస్కూలులో 2009–2010వ సంవత్సరంలో పదవ తరగతి చదివినవారు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థి దశలో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఏ ఏ రంగాల్లో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థులకు ఏ కష్టం వచ్చినా స్నేహితులు ఆదుకోవాలని, తమ ఉన్నతికి బాటలు వేసిన స్కూలుకు తమ వంతు సాయం చేయాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. అప్పట్లో తమ భవితకు బాటలు వేసిన ఉపాధ్యాయులు పొన్నువేలు సింహ, పార్థసారథి, పురుషోత్తం, బాలాజీ, సుధాకర్, జయచంద్ర, గాంధీబాబు, నందకుమార్, శ్రీలక్ష్మి, మాధవి, దిల్‌షాద్‌లను ఘనంగా సత్కరించారు. వారి ఆశీస్సులు పొందారు.



తీర్థంలో కలిసిన పూర్వ విద్యార్థులు

దళితవాడలో జాతరకు సర్వం సిద్ధం



గంగమ్మ



అమ్మవారి విద్యుత్ కటౌట్

బంగారుపాళెం: స్థానిక దళితవాడలో గంగమ్మ జాతరకు నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దళితవాడలో ప్రతి సంవత్సరం జూన్‌లో జాతర వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గ్రామంలో విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన అమ్మవారి విద్యుత్ కటౌట్ చూపరులను ఇట్టే ఆకట్టుకుంటోంది. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం అంబలి, సాయంత్రం పొంగళ్లు సమర్పించనున్నారు. రాత్రి అమ్మవారిని గ్రామంలో ఊరేగించనున్నారు. బుధవారం తెల్లవారు జామున అమ్మవారిని నడివీధిలోని మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఉట్ల తిరునాళ్ల నిర్వహిస్తారు. ఆ తర్వాత అమ్మవారిని మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య జలప్రవేశానికి తరలించనున్నారు.

తగ్గువారిపల్లెలో..

మండలంలోని తగ్గువారిపల్లెలో మంగళవారం గంగమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దండుమారెమ్మ ఆలయం వద్ద ఉదయం అంబలి, సాయంత్రం అంబళ్లు సమర్పించనున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి అమ్మవారి జలప్రవేశానికి తరలించనున్నట్లు తెలిపారు.

14, 15 తేదీల్లో ముత్యాలమ్మ జాతర

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఈ నెల 14, 15వ తేదీల్లో చిత్తూరు నగరం తేనెబండలోని ముత్యాలమ్మ ఆలయంలో జాతను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 14న ఉదయం 2 గంటలకు అభిషేకం, 6 గంటలకు సింహ వాహనంపై కొండచుట్టు తిరునాళ్ల, రాత్రి 9 గంటలకు పుష్ప పల్లకిపై అమ్మవారి గ్రామోత్సవం, 15న మధ్యాహ్నం నీవానది ఒడ్డున అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 65 గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని తెలియజేశారు.

శ్రీనివాస సేతుపై నిబంధనలు పాటించాలి

తిరుపతి అర్బన్: తిరుపతిలోని శ్రీనివాస సేతుపై ప్రయాణిస్తున్న వాహనదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆర్టీసీ బస్సులకు సంబంధించి వంతెనపై వేగాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. కొందరు ఆర్టీసీ డ్రైవర్లు వంతెనపై బస్సును ఉంచడాన్ని తప్పుబట్టారు. మరికొందరు కండక్టర్లు వంతెనపై బస్సును నిలిపి, టిక్కెట్ కొట్టడం ప్రమాదకరమని హెచ్చరించారు. కొందరు కొంత దూరమే కదా అంటూ ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎదురుగా బస్సులను నడుపుతున్నారని మండిపడ్డారు. ఇంకొందరు వంతెనపై లోడింగ్, అన్‌లోడింగ్ చేయడాన్ని తప్పుబట్టారు. వంతెన పైనుంచి బస్టాండ్‌లోకి వచ్చే మార్గంలో ర్యాంప్(డౌన్)వద్ద ఆర్టీసీ సర్వీసులు వేగంగా రావడం సరికాదని చెప్పారు. శ్రీనివాస సేతుపై వేగాన్ని తగ్గించాలని ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నా రు. మరోసారి అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంతెనపై వాహనాల తాకిడి తక్కువగా ఉందనే ఉద్దేశంతో పలువురు స్పీడ్ పెంచుతున్నారని... దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన వివరించారు. వంతెనపై ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓ క్రమ పద్ధతిలో వెళ్లాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

తవణంపల్లె : ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఆమె సోమవారం పల్లెచెరువులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలన్నారు. ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో మంది గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.

14న శ్రీగోవిందరాజ స్వామి పుష్పయాగం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈ నెల 14వ తేదీన శాస్త్రోక్తంగా పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6.30 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా 14న ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం వైభవంగా చేపట్టనున్నారు. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, మల్లె, జాజి, సంపంగి, రోజా, కలువలు తదితర వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేస్తారు.

పోషకాహారంతోనే ఆరోగ్య శిశువుకు జన్మ




తీర్థం పీహెచ్‌సీలో గర్భవతులతో మాట్లాడుతున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

బైరెడ్డిపల్లె: గర్భవతులు పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మని బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని గర్భవతులకు ప్రధానమంత్రి సురక్షిత మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహతీ ఫౌండేషన్ సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేసి వారు మాట్లాడారు. ప్రతి నెలా గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. వైద్యాధికారుల సలహాలను పాటించాలన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితమన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ వైద్యాధికారి షాలిని, హెల్త్ ఎడ్యుకేటర్లు సావిత్రమ్మ, అనూరాధ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటుతో జరభద్రం

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటార్ల విషయంలో అప్రమత్తత ముఖ్యం
- నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం





పొలం, పారుతున్న నీరు

చిత్తూరు కార్పొరేషన్: రుతుపవనాలతో తొలకరి జల్లులు కురవడం, మృగశిర కార్తె కూడా ప్రారంభం కావడంతో రైతులు పొలం బాట పట్టారు. ఇప్పటికే పొలాలను దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. ఆపై విత్తనాలు విత్తినప్పటి నుంచి పంట దిగుబడి వచ్చేవరకూ వ్యవసాయ పనులపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తారు. అలాగే పంటలకు నీరు పెట్టడం కోసం తెల్లవారితే చాలు విద్యుత్ తీగలు, విద్యుత్ మోటర్ల వద్ద ఎక్కువగా పని చేస్తుంటారు. చాలా మంది రైతులు చిన్నచిన్న విద్యుత్ మరమ్మతులను స్వయంగా వారే చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు వహించకపోతే మృత్యువాత పడే అవకాశం ఉంది. పొలాల్లో కర్ర స్తంభాలు, వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు తక్కువ ధరల మోటర్లను ఎక్కువగా వాడుతుంటారు. చాలా మంది రైతులు మోటర్లు ఆరు బయట బావి ఒడ్డు, కాలువ ఒడ్డున ఉంచి చిన్న కవర్ కప్పి ఉంచుతారు. అవి కొన్నిరోజులకే దెబ్బతింటాయి. అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో మోటర్లతో ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉంది. సింగిల్ ఫేజ్ తీగ కాలికి తగిలితే మోటరు మొత్తానికి విద్యుత్ ప్రవహిస్తుంది. దానిని తాకగానే కరెంటు షాక్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో తగు జాగ్రత్తలు వహిస్తే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చని అధికారులు చెప్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్తలు ఇలా..

స్టార్టర్ డబ్బాలను మోటర్ పక్కనే పొలంలో ఉంచి రైతులు కవర్లు కప్పుతూ ఉంచారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశం లేకపోలేదు. డబ్బాలకు ఉన్న తలుపుల గురించి పట్టించుకోరు. వాటిలోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా తెంపి మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫేజు ఏదో కూడా తెలియని విధంగా ఉంటాయి కూడా. వీటిపట్ల కూడా కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. రక్షణ కవర్లను తీసివేయరాదు. నేరుగా స్టార్టర్లకు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫేజు అమర్చుకోవాలి. సొంతంగా మరమ్మతులు చేయడం మంచిది కాదు. స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి.

ఇనుప డబ్బాలతో జాగ్రత్త

చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుప డబ్బాల్లో స్టార్టర్లు, ఫేజులు బిగించడంతో ఎలుకలు డబ్బాల్లోకి వెళ్లి, తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకునే ప్రయత్నం చేయగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుంది.

తీగలతో ప్రమాదం

గాలీవానలకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే పొలంలో నుంచి విద్యుత్ తీగలను తీసుకువచ్చి ఇళ్లలో కట్టకట్టి పడేస్తుంటారు. ఆ సమయంలో ఎలుకలు కొరికే అవకాశం ఉంటుంది. రైతులు తీగలను ప్రారంభ సమయంలో తప్పనిసరిగా పరీక్షించాలి. అనంతరం మోటర్లకు తీగలను అమర్చుకోవాలి. పాత తీగల కంటే కొత్త తీగలను అమర్చుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న ప్రదే శాల్లో కొందరు రైతులు మధ్య మధ్యలో తాత్కాలికంగా కర్రలు వేసుకుని వాటికి తీగలు అమర్చుతుంటారు. ఇవి వర్షానికి, గాలులకు కిందపడి ఉంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లో పనులకు వెళ్లినప్పుడు అవి కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. స్తంభాలు దూరంగా ఉంటే ట్రాన్స్‌కో సిబ్బందితో మాట్లాడి విద్యుత్ స్తంభాలు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

తప్పనిసరి జాగ్రత్తలు

పొలాల్లో మోటర్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు. టెస్టర్ సహకారంతో మాత్రమే పరీక్షించాలి. వర్షపు నీరు, తేమ తగలని చోటవాటిని అమర్చి రక్షణగా కవర్ కప్పాలి. ఎర్తింగ్ తప్పనిసరిగా ఉంచుకోవాలి. మోటరుకు ఏదైనా మరమ్మతులు చేయాలంటే ముందుగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలి.

భద్రంగా ఉండాలి



విద్యుత్ తీగలు, మోటార్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పనులు ప్రారంభించే ముందు మోటార్లకు అమర్చే వైర్లు తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రైతులు అప్రమత్తంగా తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు.

– మునిచంద్ర, ఇన్‌చార్జి ఈఈ ట్రాన్స్‌కో

సూర్య, శేషవాహనంపై ఇంద్రవరదుడు

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండల కేంద్రంలో త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సూర్య ప్రభ వాహనం, రాత్రి శేష వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చి ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు

నేడు గరుడోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం అభిషేక పూజల పూర్తి చేసి తదనంతరం గరుడ సేవ ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. అలాగే రాత్రి కల్పవృక్ష వాహన సేవ ఉంటుందని పేర్కొన్నారు.



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు